**వ్యాసం**

◆ ప్రొ. బుర్రా రాములు

# నిన్ను యాది జేసుకుంటూ- నీ దారిలో నడుస్తాం!

బాలగోపాల్....

నిన్ను స్మరించుకొనే పరిస్థితి ఎందుకొచ్చిందయ్యా?

నీవు విమర్శను వ్యతిరేకించలేదు. పొగడ్తను స్వీకరించలేదు. నీవు చేసిందాన్నే నీకు చెప్పినా కూడా 'పొగడ్తలువద్దు, మనం చేయాల్సిందే చేశామంటివి'.

గాంధీ విలువలను ఆచరించిన అసాధారణ వ్యక్తి నరేన్ చావు ద్వారా మనకి దూరమయ్యాడని బాధపడితివిగదా? అలాంటి అసాధారణ వ్యక్తుల, శక్తుల కూడికైన నిన్ను స్మరించుకునే సరిపోల్చుకునే మాకు తెలియజేయకుండానే వెళ్ళిపోతివి. మాకు నీవు నడిచిన పథం తప్ప నిన్ను వర్ణించే పదం లేదాయె.

బాలగోపాల్! నీకు యాది మరువులేదు. అయినా గుర్తుచేస్తాము. మహదేవపూర్ అడవిలోని బొర్లగూడెం గ్రామంలోని ఓ గిరిజన రైతు ఎద్దుని చంపిన రాజ్యసాయుధ బలగాల సంఘటనపై నిజనిర్ధారణ కోసమని ప్రశ్నించే నీ అడుగు మొదలై మొన్నటి దసరా నాడు సిరోంచ-సోమన్ పల్లి ఆదివాసీల ఎన్‌కౌంటర్ దాకా సాగె. సిరోంచకు ఆ పక్కన గోదావరిలో ఇంద్రావతి దునుక్కుంటూ కలిసే దగ్గర దమ్మూర్‌కి వెళ్ళి గాయపడ్డవాళ్ళని ఈ దీపావళి నాడు కలిసి ఆ ఎన్‌కౌంటర్ ఎలా జరిగిందో నిర్ధారణ చేయాలంటివి. అట్లా కల్పిస్తివి. నువ్వు మొదటిసారి మాట తప్పితివి కదా!

ప్రజా ఉద్యమాలపై రాజ్యం చేసే దమనకాండ రూపాలను ఎత్తిచూపే, ప్రశ్నించే పౌరహక్కుల సంఘాన్ని జనజీవితంలోని అన్నిరకాల ఆధిపత్యాలను ప్రశ్నించే సంఘంగా విస్తరించితివే. ఒక్క రాజ్యహింసనే కాదు, కుటుంబ, లింగ, కుల,మత, ప్రాంత ధోరణులను, సందర్భాలను పట్టించుకోవాలంటే ఇంత పనిభారం పౌరహక్కుల సంఘం మోయలేదన్న వారితో దూరం జరిగి 'మానవ హక్కుల వేదిక' ను ఏర్పాటు చేసితివే. ఆధిపత్యం ఏ రూపంలో ఉన్నా, సారంలో ఏ రుచిలో ఉన్నా, పాలకుల విపరీతమైనా, ప్రకృతి వైపరీత్యమైనా జోక్యంచేసుకోవడం మానవహక్కుల వేదిక కార్యక్రమమంటివి! పాలకవర్గాల అభివృద్ధి ప్రక్రియ విధ్వంస ప్రక్రియేననీ, అది ప్రజాస్వామ్య స్థాపన కాదు, ప్రజా జీవిత విస్థాపనకు, ప్రకృతిని విధ్వంసం చేసి భవిష్యత్ తరాల జీవన అవకాశాలను నాశనం చేయ పూనుకున్నదని, దాన్ని ఎదుర్కోవటం కూడా హక్కుల కార్యక్షేత్రమని అనంతపురం మహాసభలో మానవహక్కుల ఎజెండాలో చెప్పి నాలుగురోజులు కాకముందే నాలుగు దిక్కుల్లో కలిసిపోతివే!

బాలగోపాల్, నీవెన్నిసార్లు చెప్పలేదు, మనం ఒకరిని మెప్పించడానికో నొప్పించడానికో లేదా ఒప్పించడానికో ఈ తొవ్వను ఎంచుకోలేదని? మనకి వ్యక్తిగత కాంక్షలు, కక్షలు ఉండవు, ఉండకూడదనీ, మనం ఏ ఒక్కరి పక్షమోకాదనీ, మనం 'మనుషులుగా జీవించలేని స్థితి' పైన్నే పోరాటం చేస్తున్నాయనీ, అందుకు మనకు విలువల సంబంధమే కాని ప్రయోజన సంబంధం లేదని చెప్పితివే!

నీ మీద రాజ్యం ఎన్నిరూపాల్లో నిర్బంధం మోపినా, అక్రమ కేసులు పెట్టి ఒంటరి సెల్‌లో బంధించినా, దాడులు చేసి, చేయించి చంపాలనుకున్నా ఒక్కక్షణం కూడా ఈ హక్కుల తొవ్వను విడిచిపెట్టకుండా ఉన్నావే!

వరంగల్‌లో మొదలైన నీ హక్కుల పోరాట యాత్ర భారతదేశ ఎల్లలు దాటేసింది. భారత ప్రజల గుండెల నిండా నీవేనే!

మనం ఎలా సహజీవనం గడపాలో చెప్పితివి. మానవీయ సంబంధాలకోసం మనం ఇప్పుడు సాహసంగా నిలువాలని చెప్పితివే! నీ సహచర్యం మాలో సహనాన్నీ, సాహసాన్ని పెంచినా గాని నీవులేని నిజాన్ని ఎలా సహించమంటావ్? నీవు లేకుండానే సహనంతో సాహసాన్ని చేసే సందర్భాన్ని ఊహించలేకున్నామే, భరించలేకున్నామే! అయినా నీ సహచర అనుచరబంధాలు ప్రజాస్వామ్య శక్తిగా మాలో ఆవిష్కరించి, సహనం సాహసం పెనవేసుకుని, నీ మార్గాన్నే సహజంగానే ముందుకి పోతామని చెబుతున్నాం బాలగోపాల్!

నీ గురించి ఎవరేమనుకుంటున్నారో నువ్వు ఊహించి ఉండలేవు. అయినా నీ గురించి నువ్వు ఎప్పుడయినా పట్టించుకున్నావా? 'తన-పర' లేరనీ, 'చాటు-నేటు' లేవని, నువ్వు జీవించింది నీ కోసం కాదని ప్రతిక్షణం ఆచరణ అద్దంలో చూపిస్తూనే ఉంటివి. జనం కోసమే ఇంత చేసినవాడివి, కనీసం ఒక్కక్షణమన్నా 'నీ' గురించి ఆలోచించి ఉంటే మాకు కనబడకుండా పోదువా?

బాలగోపాల్

"ఓ చారిత్రక అవసరానికోసం పుట్టించబడినవాడివా?"

"ఓ చారిత్రక పరిస్థితి నిన్ను పుట్టించిందా?"

"నీలోని ఓ సహజలక్షణం ఈ చారిత్రక అవసరాన్ని తీర్చిందా?" అని ఈ నేలని నమ్ముకున్నవాళ్ళు, ఈ నేలని అమ్ముకునేవాళ్ళు సంభాషించుకుంటున్నారు. వాళ్ళకి ఏం చెప్పమంటావ్?

బాలగోపాల్,

నీకిదీ తెలిసిందో లేదో- స్వప్రయోజనం కోసం స్వాభిమానాన్నీ, నేలనే కాదు జాతినీ తాకట్టుపెట్టే మేధావులు నువ్వు బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినావు కాబట్టే మార్క్సిజంలో వెలుతులున్నాయని చెప్పి అవి తేల్చకుండా పోయావని అంటున్నారు.

బాలగోపాల్,

ఏదేని సంఘటన జరిగితే అందులో హక్కుల ఉల్లంఘనను నిర్ధారణ చేయకుండా కనీసం అంచనా కూడా ప్రకటించడానికి ఒప్పుకోని నీ నైజం తెలిసికూడా ఈ ఇజాల కబ్జాదారులు నిన్ను శంకించి వారి పరనింద - ఆత్మస్తుతి తీరుని మరోసారి ప్రకటించుకున్నారనుకోవాలా? చెప్పు, బాలగోపాల్, చెప్పు... నువ్వేలా చెబుతావ్? మేమే చెబుతాం. శరీరాన్ని విస్మరించి జీవించిన నిన్ను తూచడానికి బ్రాహ్మణీయ భావజాల కుల తరాజులు, పాలకవర్గ కాంటాలు పక్కనపెట్టి మానవీయ విలువల ప్రజాధర్మ కాంటా దగ్గరకి రమ్మని అంటాం. ఇది అత్యంత సహనంతో అంటున్నదే సుమా!

❖